క్లుప్తంగా

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాసరావు

ఏలేశ్వరం: తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి కానిస్టేబుల్ శ్రీనివాసరావు విధులు నిర్వహించారు. ఈ సందర్భంలో కొందరు వ్యక్తులు ఓ పిల్లాడిని తీసుకువచ్చి తప్పిపోయాడని అప్పగించారు. ఉదయాన్నే కానిస్టేబుల్ శ్రీనివాసరావు పిల్లాడి ద్వారా వివరాలు తెలుసుకుని అడ్డతీగల మండలం మెట్లపాలెం గ్రామం తీసుకువెళ్లి తల్లిదండ్రులను అప్పగించారు. కానిస్టేబుల్ శ్రీనివాసరావును ఎస్సై జి.సతీష్, సిబ్బంది అభినందించారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం



సిరిపురంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం సుందరరావు

ఏలేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు సిరిపురం ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం జి.సుందరరావు అన్నారు. సిరిపురంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించారు. విద్య ఆవశ్యకత గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ బడిఈడు పిల్లలను విధిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు స్కూల్ యూనిఫాం, షూ, పాఠ్య పుస్తకాలు తదితరాలను ప్రభుత్వం అందజేస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు మురళి, అప్పారావు, జ్యోతి, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



వెయిట్స్ ఎత్తుతున్న వీరబాబు

జగ్గంపేట: ఇటీవల సంయుక్త భారత్ ఖేల్ ఫౌండేషన్ పంకజ్ గపులే ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జగ్గంపేట యువకుడు బుర్ర శివ సాయి వీరబాబు పాల్గొని ప్రతిభ కనబరిచాడు. రెండు బంగారు, వెండి పతకం సాధించాడు. ఈ మేరకు వివరాలను శుక్రవారం స్థానికంగా కోచ్ కన్నారావు తెలిపారు. 74 కిలోల విభాగం వెయిట్, పవర్ లిఫ్టింగ్‌లలో రెండు బంగారు పతకాలు, డిస్కస్ త్రోలో వెండి పతకం సాధించినట్లు వివరించారు. ఆగస్టులో దుబాయిలో జరిగే ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు వీరబాబును నిర్వాహకులు ఎంపిక చేశారన్నారు. ఆయన్ని మండల సచివాలయాల కన్వీనర్, గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా తదితరులు అభినందించారు.

సెగ.. భగభగ



తుని మండలం ఎస్.అన్నవరంలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

తుని రూరల్/ప్రత్తిపాడు రూరల్: భానుడు భగభగ మంటుంటే రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఇంట్లో ఉన్న వృద్ధులు, చిన్నారులు ఉక్కబోతతో అల్లాడిపోయారు. మండలంలో శుక్రవారం అత్యధికంగా 39 డిగ్రీలు, అత్యల్పంగా 28 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యారు. వేడిగాలులు, ఆపై ఉక్కబోత జనానికి విసుగు పుట్టించింది. సూర్య ప్రతాపానికి ఎస్.అన్నవరం, డి.పోలవరం, తేటగుంట, తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు వెలవెలబోయాయి. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకూ వేడి తగ్గలేదు. ప్రత్తిపాడు మండలంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

కూల్ కూల్‌గా..



తుని మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

తుని: వేసవిలో చల్లదనం ఇచ్చే పుచ్చకాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. మెట్ట ప్రాంత ఇసుక నేలల్లో వీటిని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం విరివిగా దిగుబడులు వచ్చాయి. పిల్లల నుంచి పెద్దల వరకూ వీటిని తినేందుకు ఇష్టపడుతుంటారు. విటమిన్లు పుష్కలంగా ఉండడంతో జనం ఎక్కువగా కొంటున్నారు. తుని పట్టణ మార్కెట్ యార్డులోని రైతు బజారుకు పెద్ద సంఖ్యలో పుచ్చకాయలు వచ్చాయి. సైజును బట్టి రూ.40 నుంచి రూ.150 వరకూ ధర పలుకుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

మామిడి పండ్లండోయ్..



ఏలేశ్వరంలో మామిడి పండ్ల దుకాణాలు

ఏలేశ్వరం: నోరూరించే మామిడి పండ్ల ధర దిగొచ్చింది.. సామాన్యులకూ అందుబాటులో ఉంది.. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడులు ఉండడంతో ధర తగ్గుముఖం పట్టింది. ఏలేశ్వరం హనుమాన్‌జంక్షన్, మార్కెట్ వీధుల్లో ప్రధాన రహదారులను ఆనుకుని మామిడి పండ్ల విక్రయ దుకాణాలు భారీగా వెలశారు. ఈ పండ్ల రకాలను బట్టి పరక రూ.100 నుంచి రూ.150 వరకూ విక్రయిస్తున్నారు. ప్రస్తుతం బంగినపల్లి, సువర్ణరేఖ, చెరుకురసం, కొబ్బరిమామిడి, కలెక్టర్ రకాల మామిడి పండ్ల విక్రయాలు జరుగుతున్నాయి.

విద్య.. విజ్ఞానం.. వినోదం

- ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు
- గ్రంథాలయాలకు తరలివస్తున్న విద్యార్థులు



ఏలేశ్వరం గ్రంథాలయంలోని వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు

ఏలేశ్వరం: సెలవులు... చిన్నారులు ఆటపాటలతో గడిపే రోజులు. ఈ సమయాన్ని పలువురు విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. విద్య, విజ్ఞానం, వినోద కార్యక్రమాలకు కేటాయిస్తున్నారు.. తమకు నచ్చిన అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచుతున్నాయి. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు సుమారు 33 రోజుల పాటు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ధర్మవరం, శంఖవరం, ఏలేశ్వరం గ్రంథాలయాల్లో ఈ శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆయా గ్రంథాలయాల్లో మే 8 నుంచి జూన్ 11 వరకూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఈ శిబిరాల్లో ముఖ్యంగా కథలు వినడం, పుస్తక పఠనం, సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఏలేశ్వరం గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, చిత్రకారులు విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కన్నూరి సతీష్‌బాబు గణితం, శిష్టా శివరామకృష్ణమూర్తి మంచి నడవడిక, రాజశేఖర్ యోగా, రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడి రాము చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్ తదితర అంశాలు వివరిస్తున్నారు. రోజూ సుమారు 50 మంది హాజరవుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు రోజూ కథలు చెప్పడంతో పాటు చదవడం, పద్యాలు రాయడంలో తర్ఫీదు ఇస్తున్నారు.

ఖాళీ సమయం సద్వినియోగం



విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించడానికి ప్రభుత్వం వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోంది. దీంతో చిన్నారులు పలు అంశాలపై పట్టు సాధిస్తున్నారు. వేసవిలో ఖాళీ సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇది సాధ్యమవుతోంది.

– కవికొండల సత్యనారాయణ, లైబ్రేరియన్, ఏలేశ్వరం

మాకెంతో ఉపయోగం



గ్రంథాలయంలోని వేసవి విజ్ఞాన శిబిరాల్లో అనేక అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. కథలు వినడం, చదవడంపై పట్టు సాధించాను. దీని ద్వారా విజ్ఞానం పెరుగుతుంది. అనేక అంశాలపై అవగాహన పెరుగుతోంది. ఇది మాకెంతో ఉపయోగపడుతోంది.

– మజ్జి అఖిల, 9వ తరగతి విద్యార్థిని, ఏలేశ్వరం

చిత్రలేఖనంపై ఆసక్తితో..



నాకు చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం అంటే చాలా ఇష్టం. ఆ ఆసక్తితో గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి వస్తున్నాను. ఇక్కడి శిక్షణతో చిత్రాలు ఎలా గీయాలో అవగాహన పెంచుకున్నాను. ఇలాంటి శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయం.

– కె.నవ్యశ్రీ, 9వ తరగతి, ఏలేశ్వరం

తాండవ నదిలో చెత్త తొలగింపు

కోటనందూరు: స్థానిక తాండవ బ్రిడ్జి కింద నదిలో పేరుకుపోయిన చెత్తను పంచాయతీ అధికారులు తొలగించారు. ఖరీఫ్‌లో సాగునీటికి, పశువుల తాగునీటికి ఇబ్బంది లేకుండా శుక్రవారం సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి, పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ దగ్గరుండి పొక్లెయిన్‌తో చెత్తను తొలగించి సంపద కేంద్రానికి తరలించారు. బ్రిడ్జిపై నుంచి నదిలోకి చెత్త, మాంసం వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు రాజానాగేశ్వరరావు, భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ



కిర్లంపూడి గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న కురుమళ్ల విష్ణు

కిర్లంపూడి: స్థానిక గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరం కొనసాగింది. సీనియర్ పాఠకుడు కురుమళ్ల విష్ణు భగీరథ ప్రయత్నం, స్వాతంత్ర పోరాట యోధులు, బ్రిటిష్ నిరంకుశ పాలన వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయ నిర్వాహకుడు దంత మరిడి బాబు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, గణితం, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వీరవరంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ తోట రవి, గాంధీ

కిర్లంపూడి: ప్రభుత్వ పథకాలను అర్హులకు చేర్చడంలో వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీపీ తోట రవి అన్నారు. శుక్రవారం వీరవరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అంబటి బొజ్జమ్మ అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి తోట రవితో పాటు తోట గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధుల్లా వలంటీర్లు వ్యవహరిస్తున్నారని అమన్నారు. వీరి సేవలను గుర్తిస్తూ ఏటా గౌరవించడం ఆనందంగా ఉందన్నారు. తొలుత రెండు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 32 మంది వలంటీర్లతో పాటు వారి తల్లిదండ్రులను సత్కరించారు. వైస్ ప్రెసిడెంట్ తోట నారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు తోట వేణు, ఎంపీడీఓ బి.సతీష్‌బాబు, దంట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పాలనా నైపుణ్యంపై జెడ్పీటీసీలకు శిక్షణ



జెడ్పీటీసీలకు శిక్షణ ఇస్తున్న కోనసీమ జిల్లా డీఆర్‌డీఏ పీడీ శివశంకరప్రసాద్

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో ఉమ్మడి ఐదు జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులకు శుక్రవారం కోనసీమ జిల్లా డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ వీవీ శివశంకరప్రసాద్ డీఆర్‌డీఏ అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. పేదరిక నిర్మూలన కోసం స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి వారికి బ్యాంకుల నుంచి రుణాలు అందజేసి ఆ రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. కోనసీమ డ్వామా పీడీ ఎస్ మధుసూదనరావు పంచాయతీల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి ఉపాధి హామీ పథకంలో చేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఉపాధి కూలీలను గుర్తించి వారికి జాబ్ కార్డులు అందజేసి తప్పని సరిగా 100 రోజుల పని కల్పించేలా చర్యలు తనుకుంటున్నట్టు తెలిపారు. కాకినాడ జిల్లా స్త్రీ–శిశుసంక్షేమ శాఖ పీడీ జి.సత్యవేణి ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు వాటి పని తీరుపై వివరించారు. ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఈ కృష్ణమోహన్, మేనేజర్ పి. శ్రీనివాసరావు, సీనియర్ ఫ్యాకల్టీ శ్రీదేవి, ఎంఎస్‌ఎన్ రెడ్డి శిక్షణ నిర్వహించారు.

46,846 మందికి రైతు భరోసా

తుని రూరల్: వ్యవసాయ శాఖ తుని సబ్ డివిజన్‌లో 46,846 మంది రైతులకు రూ.25.90 కోట్ల రైతు భరోసా నిధులు జమ అయినట్లు సహాయ సంచాలకుడు సుంకర బుల్లిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని ఆయా రైతుల బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల ఒకటో తేదీన లాంఛనంగా కంప్యూటర్ బటన్ నొక్కి నిధులను జమ చేశారన్నారు. తుని మండలంలో 12,342 మందికి రూ.6.80,39,000, తొండంగిలో 8,960 మందికి రూ.4,92,80,000, కోటనందూరులో 8,285 మందికి రూ.4,56,57,500, శంఖవరంలో 7,392 మందికి రూ.4,13,64,000, రౌతులపూడి మండలంలో 9,867 మందికి రూ.5,47,16,500ల చొప్పున లబ్ధి చేకూరిందన్నారు. ఈ మొత్తాలను రైతులు ఖరీఫ్ పెట్టుబడికి వినియోగించుకోవాలన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పిఠాపురం: పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు శుక్రవారం పిఠాపురం రూరల్ పోలీసులు తెలిపారు. పి.రాయవరం శివారులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై అబ్దుల్ నబీ తన సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.6,510 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మలేరియాను తరిమికొడదాం..



కోటనందూరులో మలేరియాపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ

కోటనందూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మలేరియాను తరిమికొట్టాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఇందిరా ప్రియదర్శిని పిలుపునిచ్చారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇళ్ల మధ్య నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మలేరియా వ్యాధిగ్రస్తులకు పీహెచ్‌సీలో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

పలువురికి సత్కారం



అంగన్‌వాడీ కార్యకర్తను సత్కరించిన సర్పంచ్, గ్రామస్తులు

తుని రూరల్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఐదుగురు విద్యార్థులను, అమెరికాలో పీహెచ్‌డీ చేసేందుకు వెళుతున్న విద్యార్థిని, పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ కార్యకర్తను చేపూరు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఆ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఐదుగురు విద్యార్థులను సన్మానించి, నగదు బహుమతులు అందజేశారు. పాలిటెక్నిక్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని, పీహెచ్‌డీ చేసేందుకు యూఎస్‌ఏ వెళుతున్న విద్యార్థి రామకృష్ణను ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ కార్యకర్త సరస్వతికి గ్రామస్తుల సహకారంతో రూ.95 వేల నగదు, సర్పంచ్ కొండ్రు నాగేశ్వరరావు సొంత ఖర్చుతో సెంటిన్నర ఇంటి స్థలాన్ని అందజేశారు. శర్మమాస్టర్, ఎల్‌ఐసీ డీఓ జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక



స్విమ్మింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

సామర్లకోట: స్థానిక దుర్గాప్రసాద్ పబ్లిక్ స్కూల్‌లో కాకినాడ జిల్లాకు సంబంధించిన స్విమ్మింగ్ (ఆక్వాటిక్) క్రీడాకారుల ఎంపిక శుక్రవారం జరిగింది. జిల్లా అక్వాటిక్ సంఘ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, కార్యదర్శి ఇరుసుమళ్ల రాజు, సంఘ సలహాదారుడు మంగా వెంకటశివరామకృష్ణ ఆధ్వర్యం లో జిల్లా క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల పదో తేదీన విజయవాడలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు జూలై 2 నుంచి 5 వరకు హైదరాబాద్‌లో జరిగే సీనియర్ నేషనల్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కోచ్‌లు ఎం.అజయ్ కుమార్, ఎస్‌కే రాజా, హరి, నాని క్రీడాకారులను ఎంపిక చేశారు. పురుషుల విభాగంలో 11 మందిని, స్త్రీల విభాగంలో 12 మందిని ఎంపిక చేశారు.

ముగిసిన జిల్లాస్థాయి కబడ్డీ శిక్షణ

సామర్లకోట: స్థానిక ప్రతిభ హైస్కూల్ గ్రౌండ్‌లో నెల రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్త్రీ, పురుష కబడ్డీ క్రీడాకారులకు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అండర్ 14 క్రీడాకారుల మధ్య 12వ మినీ ఒలింపిడ్–23 వారి సమక్షంలో స్త్రీ, పురుషులకు కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపిక చేయనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసు తెలిపారు. రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు పద్మనాభం ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులకు సర్టిఫికేట్లు అందజేశారు. ప్రో కబడ్డీ రిఫరీ బోగిళ్ల మురళీకుమార్, పీడీలు తాళ్లూరి వైకుంఠం, కిరణ్‌కుమార్, వీరబాబు, కోటి, నిర్వాహకులు బుల్లి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి



శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి

సామర్లకోట: గ్రామాల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి అన్నారు. శుక్రవారం స్థానిక టీటీడీసీలో జిల్లాకు చెందిన డీఆర్‌డీఏలోని ఏపీఎంలు, సీసీలకు నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాపులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామాల్లో వ్యాపారాలు చేయడానికి ఉత్సాహంగా ఉన్న మహిళలను గుర్తించి వారికి ప్రత్యేకంగా శిక్షణ నిర్వహించాలన్నారు. ఈ మేరకు వారికి కావలసిన రుణాలను బ్యాంకుల ద్వారా అందజేసేలా ఏపీఎంలు, సీసీలు కృషి చేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ద్వారా బ్యాంకుల అధికారులకు మహిళా సంఘాలకు, ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే అంశంపై నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు మహిళలను ఆయా రంగాలల్లో ప్రోత్సహించేలా పరిశ్రమల శాఖ కృషి చేస్తుందన్నారు. ఉద్యానవనశాఖ, పశుసంవర్ధకశాఖ, వ్యవసాయశాఖలకు చెందిన అధికారులు గ్రామాల్లో ఉత్సాహంగా ఉన్న మహిళలను గుర్తించాలన్నారు. ప్రతి మండలం నుంచి 15 మందికి తక్కువ కాకుండా లబ్ధిదారులను ఎంపిక చేసి మండలంలో మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి బ్యాంకు లింకేజ్ డీపీఎం ఎ పద్మావతి అధ్యక్షత వహించగా యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ డీవీ రంగారావు, మత్స్యశాఖ ఏడీ కరుణాకర్, పశుసంవర్ధకశాఖ ఏడీ కె.తాతయ్య, పరిశ్రమల శాఖాధికారి శ్రీనివాస్, డీపీఎంలు వీబీ రాయ్, కేశవ్, భరత్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు హాజరయ్యారు.

ముందుకు సాగుదామా...

- కూరగాయల సాగు లాభదాయకం
- పత్తి, వరి కంటే ఎక్కువ ఆదాయం
- ఉద్యాన శాఖ ప్రోత్సాహకాలు



రౌతులపూడిలో బీర పంట

తుని: పుడమిని నమ్ముకున్న రైతన్నలు మిశ్రమ పంటల వైపు అడుగులేస్తున్నారు.. ఒకే పంట వేసి ఆర్థికంగా నష్టపోకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా పంట మార్పిడి విధానానికి మొగ్గు చూపుతున్నారు. మెట్టలోని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వరి తర్వాత కూరగాయల సాగుకు ఆకర్షితులవుతున్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలు, కూరగాయలకు డిమాండ్ ఉండడంతో ఎక్కువ మంది సాగుకు సన్నద్ధమయ్యారు. తుని నియోజకవర్గంలో 360 ఎకరాల్లో కూరగాయల సాగు విస్తీర్ణం ఉంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 270, జగ్గంపేట నియోజకవర్గంలో 157 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతోంది. ఈ సీజన్‌లో క్లస్టర్ పరిధిలో సన్నకారు రైతులు 887 ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇచ్చారు. ఉన్న భూమిలో ఒకే పంటకు బదులు ఎక్కువ రకాలను సాగు చేస్తున్నారు. దీంతో పాటు కొంత మంది రైతులు అంతర పంటగా కూరగాయలను వేసి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వివిధ రకాల కూరగాయలను అన్ని సీజన్లలో పండించడం ద్వారా ఏడాది పొడుగునా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. బోరు బావులకు అవసరం మేరకు విద్యుత్ వినియోగించి దిగుబడులను సాధిస్తున్నారు. రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు.

పండించేది ఎలా అంటే..

మెట్ట ప్రాంతాలైన మూడు నియోజకవర్గాల్లో వర్షాధార భూములు ఎక్కువ. బోరు బావులున్న ప్రాంతాల్లో కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. గతంలో ఒకే పంటను వేయడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. ఈ విధానానికి స్వస్తి పలికి మిశ్రమ పంటల వైపు సాగుతున్నారు. ఎకరా భూమిలో నాలుగు నుంచి ఆరు రకాల పంటలను వేస్తున్నారు. భూమిని చిన్న మడులుగా తయారు చేసి వాటిలో వంగ, బెండ, బీర, కాకర, ఆనప, టమోటా, తోటకూర, పాలకూర, గోంగూర, మెంతుకూర, మిరప, కూర బొబ్బర తదితర రకాలను వేస్తున్నారు. విత్తనాలు ఎంపిక నుంచి ఎరువులు, నీటి యాజమాన్యం వరకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంట మార్పిడి విధానంతో చీడపీడలు తగ్గడంతో పాటు దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంటుంది. ఎకరాకు రూ. 30 వేల వరకు పెట్టుబడి అవుతోంది. ఏడాదికి రూ. 90 వేల వరకు ఆదాయం వస్తోంది.

అందుబాటులో రైతుబజార్లు

తుని మండలం చామవరం, వల్లూరు, కుమ్మరిలోవ, వి.కొత్తూరు, తాళ్లూరు, కొలిమేరు, రేఖవానిపాలెం, మరువాడ, నందిఒంపు, దొండవాక, కేఓ మల్లవరం, లోవకొత్తూరు, వల్లూరు తదితర గ్రామాల్లో పండించిన కూరగాయలను తుని మార్కెట్ యార్డుకు తీసుకు వస్తున్నారు. రైతుబజారులో నేరుగా రైతులే అమ్ముకుంటున్నారు. అంతే కాకుండా ఇతర ప్రాంతాల వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేసి ఎగుమతులు చేసుకుంటున్నారు. జగ్గంపేట రైతులు రాజమహేంద్రవరం, ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని రౌతులపూడి, శంఖవరం మండలాలకు చెందిన రైతులు విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ తదితర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు.

ఉద్యాన శాఖ రాయితీలు



కూరగాయ పంటలు సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై విత్తనాలు అందిస్తున్నాం. బోరు బావి సదుపాయం ఉన్న రైతులకు డ్రిప్‌ను ఏర్పాటు చేసుకోవడానికి 90 శాతం మేర రాయితీని ప్రభుత్వం ఇస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కూరగాయల సాగు లాభదాయకం. రైతులు ఉద్యానశాఖ అధికారుల సూచనలు పాటించాలి.

– ఎం. విజయలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి, తుని